

నేటి నుంచి గ్రామాల్లో 'ప్రత్యేక' పాలన



- ముగిసిన సర్పంచుల పదవీకాలం
- ఆదాయం ఉన్న పంచాయతీల కోసం పైరవీలు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 1: గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానున్నది. గ్రామ పంచాయతీల పాలకవర్గ పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ పాలన బాధ్యతలను జిల్లా, మండల స్థాయి అధికారులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాలో 313 గ్రామ పంచాయతీలు

జిల్లాలో 313 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో పెద్ద గ్రామ పంచాయతీలకు, మండల కేంద్ర పంచాయతీలకు జిల్లా స్థాయి అధికారులను, చిన్న గ్రామ పంచాయతీలకు తహసీల్దార్లు,సూపరింటెండెంట్ స్థాయి అధికారులను నియమించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో ఇసుక, గ్రానైట్, మట్టి, ఇతర సీనరేజీ ఆదాయ వనరులు, స్టాంపు డ్యూటీతో ఎక్కువగా ఆదాయం వచ్చే గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియమాకాల్లో జోరుగా పైరవీలు జరిగాయని విమర్శలు వస్తున్నాయి. ఆదాయం అధికంగా ఉన్న పంచాయతీల బాధ్యతలను తహసీల్దార్లకు అప్ప గించారనే ప్రచారం జరుగుతోంది.

శుక్రవారం వరకు ప్రత్యేకాధికారులను నియమించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. 24 గంటల ముందు వరకు ప్రత్యేక అధికారుల తుదిజాబితాను విడుదల చేయక పోవడం పైరవీల కోసమేనని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామ సర్పంచులు, ఇతర పాలకవర్గ పదవీకాలం ఈనెల 1తో ముగియడంతో ఇప్పటికే చాలా గ్రామాల్లో కార్యదర్శులు సర్పంచుల నుంచి పంచాయతీ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని గ్రామాల్లో సర్పంచులకు వీడ్కోలు సమావేశాలు ఏర్పాటు చేశారు.

పెండింగ్ బిల్లులపై ఆందోళన

సర్పంచులే గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాల కల్పన, వీధిదీపాల ఏర్పాటు, తెలంగాణకు హరితహారంలో పల్లెప్రగతి వనాలు, వైకుంఠదామాలు, క్రీడాప్రాంగణాల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలను, పారిశుధ్య నిర్వహణ బాధ్యత చేపట్టారు. దీంతో రాష్ట్రం స్వచ్ఛతతో పాటు పలు రంగాల్లో రాష్ట్రానికి దేశస్థాయిలో గుర్తింపు వచ్చే అవార్డులు వచ్చాయి. సర్పంచులకు మాత్రం బిల్లులు చెల్లించక పోవడంతో పలువురు సర్పంచులు ఇబ్బందిపడ్డారు.

ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతూ వేసారి కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మరికొందరు సర్పంచులు ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆత్మహత్యాయత్నాలకు పాల్పడ్డారు. ప్రభుత్వం తమకు రావలసిన బిల్లులను వెంటనే చెల్లించాలని పలుమార్లు సర్పంచులు కోరినప్పటికీ వారికి బిల్లులు ఇవ్వలేదు. మరోవైపు 2020, 2021 సంవత్సరాల్లో కొవిడ్‌తో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేక పోయామని, తమ పదవీ కాలాన్ని రెండేళ్లు పెంచాలని లేదా పర్సన్ ఇన్‌చార్జీలుగా తమకే బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నారు.

ఎన్నికలను నిర్వహించాలని, తమకు రావలసిన బిల్లులను వెంటనే ఇప్పించాలని రాష్ట్ర, జిల్లా సర్పంచుల సంఘా లతోపాటు సర్పంచులు కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలనే ఆలోచనలో భాగంగానే సర్పంచుల పదవీకాలం ముగి సిన వెంటనే ప్రత్యేకాధికారుల పాలనను అమలులోకి తెచ్చిందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

అసంపూర్తిగా అభివృద్ధి పనులు

గత నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి అంతకుముందు అర్థాంతరంగా వదిలిపెట్టిన అభివృద్ధి పనులు ముందుకు సాగలేదు. సర్పంచుల పదవీకాలం ముగియనుండడంతో వారు సమస్యలపైగానీ, అభివృద్ధిపైకానీ పెద్దగా దృష్టిపెట్టక పోవడంతో అనేక గ్రామాల్లో ప్రజలు పలుసమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారుల పాలనలోనైనా తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని పల్లె ప్రజలు ఆశిస్తుండగా, తమ పెండింగ్ బిల్లులను ఇవ్వాలని సర్పంచులు, కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

ప్లాస్టిక్ దుకాణాలపై బల్దియా అధికారుల దాడులు



స్వాధీనం చేసుకున్న నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 1: నగరపాలక సంస్థ అధికారులు నగరంలోని టవర్ సర్కిల్ ప్రాంతంలోని ప్లాస్టిక్ దుకాణాలపై గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. అమ్మకానికి, వినియోగించేందుకు సిద్ధంగా ఉన్న నిషేధిత వస్తువులను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. దుకాణాల యజమానులపై 13,500 రూపాయల జరిమానా విధించినట్లు నగరపాలక సంస్థ ఎన్విరాన్‌మెంటల్ అధికారి స్వామి తెలిపారు.

49 ఆటోలకు జరిమానా



ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ ఠాణాలో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ పర్శ రమేష్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 1: కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు గురువారం నగరంలో ప్రత్యే తనిఖీలు నిర్వహించి ధ్రువపత్రాలు లేని 49 ఆటోలను పట్టుకున్నారు. కరీంనగర్ ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్ ఆధ్వర్యంలో నగరంలోని పలు చోట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ చలాన్ ద్వారా జరిమానా విధించి చెల్లించిన తరువాత వదిలిపెట్టారు. ఈ సందర్భంగా సీఐ పర్శ రమేష్ మాట్లాడుతూ నగరంలో ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకోవద్దన్నారు. ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించిన ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని రకాల వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రయాణం చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఇషాక్ పాల్గొన్నారు.

16న ఆశా కార్యకర్తల సమ్మె

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 1: దేశ వ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో ఈనెల 16న నిర్వహించే సమ్మెలో పాల్గొంటున్నామని తెలుపుతూ ఆశా కార్యకర్తలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో గురువారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్ కార్మిక సంఘాలు ఈనెల 16న అఖిల భారత స్థాయిలో కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలని నిర్ణయించాయని తెలిపారు. ఆశా వర్కర్స్ ఎన్‌హెచ్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని, 45వ ఐఎల్‌సీ సిఫారసు ప్రకారం కార్మికులుగా గుర్తించాలని, కనీసం వేతనం 26 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న అన్ని మండల కేంద్రాల్లో కార్మిక సంఘాల పిలుపులో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పుల్లెల మల్లయ్య పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీలపై కొరడా

10 కేసులు నమోదు, రూ. 6.16 కోట్ల జరిమానా

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 1: తవ్వకాలు, రవాణాలో అక్రమాలకు పాల్పడుతున్న పలు సంస్థలపై గనులు, భూగర్భశాఖ కేసులు నమోదు చేసి భారీగా జరిమానా విధించింది. జిల్లాలోని గ్రానైట్ క్వారీలు, కంకర, మట్టి, ఇసుక అక్రమ రవాణాపై వారం రోజులుగా గనులు, భూగర్భ శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 10 కేసులు నమోదు చేశారు. క్వారీ హద్దులు అతిక్రమించి ఖనిజాల తవ్వకాలకు పాల్పడిన సంస్థలపై నాలుగు కేసులు నమోదు చేసి 6.11 కోట్ల రూపాయల జరిమానా విధించారు. రవాణా వాహనాలను తనిఖీ చేసి 5,12,128 రూపాయల జరిమానా విధించామని గనులు,భూగర్భ శాఖ సహాయ సంచాలకుడు ఎన్ రామాచారి తెలిపారు.

రేపు జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 1: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటేశ్వర్‌రావు, కె శంకర్, కోశాధికారి జి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని విద్యానగర్ రత్నంగ్లోబల్ స్కూల్‌లో శనివారం ఉదయం 10.30 గంటలకు టెస్ట్ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 6304704413 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

భూకబ్జా కేసులో మాజీ ఎంపీటీసీ అరెస్టు



- పోలీస్ కస్టడీకి కార్పొరేటర్ జంగిలి సాగర్
- అక్రమదందాలపై మరి కొందరిపై ఫిర్యాదులు


కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 1: భూకబ్జాలు, దౌర్జన్యాలు, బెదిరింపుల కేసులో పోలీసులు మరో ఇద్దరిని అరెస్టు చేశారు. నకిలీ స్టాంపులు, నకిలీ ధ్రువపత్రాలు తయారు చేయడం, సర్పంచ్, పంచాయతి కార్యదర్శిల సంతకాలను ఫోర్జరీ చేసిన కేసులో తీగలగుట్టపల్లి మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మణ్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. చొప్పదండి మండలం రాగంపేటకు చెందిన దీటి మధు 2013లో ఆరెపల్లి శివారులో సర్వే నంబరు 311లో ప్లాట్ నంబర్ 5లో 91 గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసి తన భార్య పేరిట మార్చి ఇంటిని నిర్మించుకున్నాడు. ఆ తరువాత గుంజ లక్ష్మణ్ అనే వ్యక్తి వచ్చి ఆ ఇల్లు తనదేనని, ఖాళీ చేయకుంటే చంపుతానని బెదిరించినట్లు జనవరి 31న మధు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. భూమయ్య, లక్ష్మణ్ స్థలాన్ని కాజేసేందుకు కుట్ర పన్ని గ్రామ సర్పంచ్, కార్యదర్శి సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ మేరకు భూమయ్య, లక్ష్మణ్‌ను గురువారం సాయంత్రం కరీంనగర్ కోర్టులో హాజరుపరచి జడ్జి ఉత్తర్వులతో 14 రోజుల కస్టడీకి కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు.

కొనసాగుతున్న ఫిర్యాదులు

భూకబ్జాలు, ఆర్థిక నేరాలకు సంబంధించి ఇప్పటి వరకు 500పైగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిసింది. ఫిర్యాదుల్లో ఉన్న తీవ్రతనుబట్టి కొన్ని సంబంధితల పోలీస్ స్టేషన్లకు పంపిస్తూ ఎస్‌హెచ్‌వోలను విచారణకు ఆదేశిస్తున్నారు. మరికొన్ని ఫిర్యాదులను ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసు అధికారులతో విచారణ జరిపించి నివేదికను తెప్పించుకుంటున్న సీపీ ప్రాధాన్యక్రమంలో కేసులను నమోదు చేస్తున్నారు. ఈ ఫిర్యాదులకు సంబంధించి అక్రమాల్లో పాలుపంచుకున్నట్లు నిర్ధారణకు వచ్చిన, అనుమానం ఉన్న దాదాపు 10 మంది కార్పొరేటర్లను, మరో 20 మంది ఇతరులను ఇప్పటికే పోలీసులు రహస్యంగా విచారించినట్లు తెలిసింది.

వరుస కేసులతో ఆందోళన

వరుస కేసులతో పలువురు కార్పొరేటర్లు, ఇతర నాయకులు, ఇప్పటికే పలు కేసుల్లో నిందితులైన కొందరు ద్వితీయశ్రేణి నాయకులు, రౌడీషీటర్లు భయాందోళనకు గురవుతున్నట్లు తెలిసింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి అనుమతుల కోసం కార్పొరేటర్లు భారీగా డిమాండ్ చేయడంపై పలు ఆరోపణలు వచ్చాయి. మున్సిపల్ కార్యాలయానికి అనుమతి కోసం వెళితే ముందుగా స్థానిక కార్పొరేటర్‌ను కలిసి రావాలని మున్సిపల్ ఉద్యోగులు చెబుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపైనే సీపీకి ఫిర్యాదులు భారీగా వెళ్లాయి. దీంతో మున్సిపల్ కార్యాలయంలోనూ పోలీసుల ప్రత్యేకటీం వారం రోజులుగా పలు రికార్డులను పరిశీలించి ఆధారాలను సేకరించినట్లు సమాచారం. చిట్టీలు నిర్వహిస్తున్న ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎనిమిది కోట్ల రూపాయల వరకు పలువురి వద్ద తీసుకుని మోసం చేశాడని బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు.



పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

భూకబ్జాలు, దౌర్జన్యాలకు సంబంధించిన ఫిర్యాదులపై అరెస్టు అయి జైలులో ఉన్న సీతారాంపూర్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను కొత్తపల్లి పోలీసులు గురువారం కస్టడీకి తీసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి శుక్రవారం ఉదయం 10 గంటల వరకు కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను కస్టడీకి ఇస్తూ కరీంనగర్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పోలీసులు జంగిలి సాగర్‌ను కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. సాగర్‌ను ఈ నెల 24 అరెస్టు చేసిన కొత్తపల్లి పోలీసులు అదే రోజు కోర్టులో హాజరు పరచి, 14 రోజుల రిమాండ్ కోర్టు ఆదేశాలతో జైలుకు తరలించారు. అతనిపై మంగళవారం రౌడీషీట్ తెరిచారు. ఉదయం కస్టడీకి తీసుకున్న పోలీసులు కొత్తపల్లి మండలం సీతారాంపూర్‌లోని అతని ఇంటిలో జంగిలిసాగర్ సమక్షంలో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిసింది. డాక్యుమెంట్లతో పాటు పలువురు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు విచారించి కొంత కీలక సమాచారాన్ని రాబట్టినట్లు సమాచారం.

కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన



కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 1: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌పై రాజకీయవర్గాలు, ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతున్నది. అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ప్రాధాన్యమివ్వడంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని బీజేపీ నాయకులు అంటున్నారు. ప్రతిపక్షాలు, వివిధ సంఘాల నాయకులు తీవ్ర నిరాశకు గురిచేశారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లాలోని కొంతమంది అభిప్రాయాలు వారి మాటల్లో....

ప్రగతి పథంలో నడిపించే బడ్జెట్

పి సుగుణాకర్‌రావు, బీజేపీ సీనియర్ నాయకుడు



మౌలిక వసతుల కల్పన ఉపాధి ఉద్యోగావకాశాలు అభివృద్ధి లక్ష్యంగా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశ పెట్టింది. పేదల, రైతు సంక్షేమ మౌలిక వసతులైన రోడ్లు, రైల్వే, ఇతర గ్రామీణ మౌళిక అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చారు. సోలార్ ఎనర్జీని సబ్సిడీల ద్వారా ప్రోత్సహించి ప్రతి కుటుంబానికి కరెంటు బిల్లుల నుంచి ఉపశమనం కల్పించడం హర్షణీయం. ఇది సంక్షేమం, అభివృద్ధి రెండింటిని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన బడ్జెట్.

నిరాశజనకంగా కేంద్ర బడ్జెట్

గులాం అహ్మద్‌హుస్సేన్, ఎంఐఎం నగర అధ్యక్షుడు



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ నిరాశజనకంగా ఉంది. ఆశలపల్లికిలో ఊరేగించి ఉసురుమని పించింది. దేశంలో నిరాశ నిస్పృహల్లో ఉన్న 30 కోట్ల మం దికి ఉద్యోగ, ఉపాధి కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పడం లేదు. దారిద్ర్య రేఖకు దిగువనున్న కోట్లాది మంది ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. విద్య వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. వేతన జీవులకు సంఘటిత అసంఘటిత కార్మిక వర్గానికి తీవ్ర నిరాశ మిగిలింది.

నిరాశ పర్చిన బడ్జెట్

మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి



కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశ జనకంగా ఉంది. మూడు లక్షల కోట్లు బడ్జెట్ పెంచి చూపించి 11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు చూపడం దేశ ఆర్థిక పరిస్థితికి నిదర్శనం. పది సంవత్స రాల కాలంలో విద్య, వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యంగా చేశారు. మోదీ పాలనలో దేశాన్ని దివాలా తీయించారు. నూటికి అరవై శాతం ఉన్న రైతాంగాన్ని కేంద్రం విస్మరించింది. - భగత్‌నగర్

వేతన జీవులకు నిరాశ..

ఖాజామంజురలీ, అశోక్‌రావు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఒక వెసులుబాటు కూడా కల్పించకుండా వేతన జీవులను పూర్తిగా నిరాశపరిచారు. కొత్త పన్నుల విధా నంలో 809సీ, 80డి, ఇంటి అద్దె, విద్య, గృహ రుణాలపై వడ్డీ తరహా మినహాయింపులు వర్తింపజేయాలని మూడేళ్లుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు.

మౌలిక వసతుల రంగానికి పెద్ద పీట

డాక్టర్ కె శ్రీవాణి, అర్థశాస్త్ర విభాగం అధ్యాపకురాలు, శాతవాహన విశ్వవిద్యాలయం

కేంద్ర బడ్జెట్‌లో మౌలిక వసతుల రంగానికి 11.11 లక్షల కోట్లు కేటాయించారు. టెక్నాలజీపై ఆధారపడే యువతకు లక్ష కోట్ల పెట్టుబడి వ్యవస్థ ఏర్పాటు చేశారు. వికసిత్ భారత్‌లో భాగంగా సంస్కరణల అమలు కోసం రాష్ట్రాలకు రాబోయే 50 సంవత్సరాల పాటు 75 వేల కోట్ల వడ్డీలేని రుణా లను అందిస్తామని చెప్పారు. ఇది ఒకరకంగా రాష్ట్రాలు అభివృద్ధి మార్గంలో పయనించ డానికి శుభసూచకం. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు రెండు కోట్ల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం కల్పించారు. - గణేశ్‌నగర్



మిషన్ టెక్‌తో సాంకేతిక అభివృద్ధి

నేదునూరి కనుకయ్య, అధ్యక్షుడు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం



కేంద్ర బడ్జెట్‌లో లక్ష కోట్లతో ప్రవేశపెట్టిన మిషన్ టెక్ పథకంతో సాంకేతిక రంగంలో పరిశోధనల విస్తృతి పెరుగుతుంది. రక్షణరంగ బలోపేతం, ప్రైవేట్ రంగంలో అంకుర సంస్థల ఏర్పాటుతో 1.4 కోట్ల యువతకు నైపుణ్య శిక్షణ మెరుగుదలకు అవకాశం ఏర్పడుతుంది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహ పథకం ద్వారా యువతకు ఉపాధి కల్పన, సాంకేతిక పరిశోధనలు, ఆవిష్కరణలు పెరిగి పారిశ్రామిక అభివృద్ధిని పెంచుతుంది.

అన్ని వర్గాలకు మేలు చేసే బడ్జెట్

గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉంది. సబ్‌కాసాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ లక్ష్యంగా కేంద్రం మంత్రి నిర్మల సీతారామన్ అన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా బడ్జెట్ ప్రవేశపెట్టారు.

విద్యారంగాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా విద్యా రంగాన్ని, తెలంగాణ రాష్ట్ర విద్యార్థి లోకాన్ని పూర్తిగా విస్మరించింది. విద్యారంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం నిధులు ఇవ్వలేదు. తెలంగాణ విభజన హామీ చట్టం ప్రకా రం ఐఐఐటీ, ఐఐటీ, ఐఐఎం, జిల్లాకో నవోదయ పాఠశా ల ఏర్పాటుకు బడ్జెట్ కేటాయించలేదు. విద్యార్థి, నిరు ద్యోగ యువత ఆకాంక్షలకు వ్యతిరేకంగా బడ్జెట్ ఉంది.

4న జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 1: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి బాలబాలికల విభాగంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ లక్ష్మీనర్సింహారావు, సీహెచ్ సంపత్‌రావు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 55 కిలోల లోపు బరువు ఉండాలని తెలిపారు. 2008 మార్చి 20 తర్వాత జన్మించినవారు అర్హులన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను ఈ నెల 16 నుంచి 19 వరకు సూర్యాపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

దాడి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 1: దాడి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు ఇచ్చారు. సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాగుల రాములు అనే వ్యక్తి కుటుంబంపై పాత పగలు మనసులో పెట్టుకొని సిరిగిరి అనిల్, మేకల కమలాకర్, సిరిగిరి యాదగిరి ప్రమీలలు నవంబరు 17, 2013న కర్రలతో రాములపై దాడిచేశారు. ఈ దాడిలో రాములు తీవ్రంగా గాయపడగా సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సిఎంఎస్ ఎస్సై శ్రావణ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పిపి చెలుముల సందీప్ వాదించారు. నిందితులైన సిరిగిరి అనిల్ , మేకల కమలాకర్‌లకు మెజిస్ట్రేట్ మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధించారని, మిగితా ఇద్దరు మరణించారని సిఐ తెలిపారు.

కవిత్వం సామాజిక చైతన్యానికి చిరునామా

● జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 1: కవిత్వం, సామాజిక చైతన్యానికి చిరునామా అని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు అన్నారు. గురువారం ఎల్ఎండి కాలనీలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయుల వృత్తి శిక్షణలో భాగంగా వివిధ రకాలైన సాహిత్య ప్రక్రియలను నేర్చుకోవాలన్నారు. కవిత్వంతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తులను బయటకు తీయవచ్చన్నారు. కవిత్వం సామాజిక చైతన్యానికి చలనశీలతకు దర్పణం అని, కవితలు రాయడం అలవర్చుకోవాలన్నారు. అనంతరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత వారాల ఆనంద్ విద్యార్థులకు కవిత్వ కార్యశాలను నిర్వహించారు. ప్రతి ఒక్కరిలో మానవీయ కోణం దాగి ఉంటుందని అందుకే ప్రతి వారు కవులు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థి దశ నుంచే కవిత్వ రచన మెళకువలు నేర్చుకుంటే కవిత్వంపై పట్టు సాధించవచ్చన్నారు. ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులతో కవిత్వం రాయించారు. ఈ సందర్భంగా వారి స్వీయ కవిత్వంతో పాటు వివిధ తెలుగు కవుల కవిత్వాన్ని ఉర్దూ కవి అయిన గుల్జార్ కవిత్వాన్ని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య, ఛాత్రోపాధ్యాయులు డాక్టర్ కె శంకర్, జి మహేశ్వర్‌రెడ్డి, గాజుల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, మంజుల, హబీబ్ ఉర రహమన్, అబ్దుల్ రవుఫ్, ఖయ్యూం, సురేఖ, శ్రీలత పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 1: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సద్దిమద్దుల సంఘం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. ఆలయంలోని చొరబడిన దొంగలు హుండీని ధ్వంసం చేసి నగదును అపహరించుకుపోయారు. గురువారం ఉదయం ఆలయంలో పూజలు చేయడం కోసం వెళ్లిన భక్తులకు హుండీ తాళం పగులకొట్టి కనిపించడంలో ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రెండు రోజుల కిందట శివాలయం, శ్రీవేణుగోపాలస్వామి బాలాలయంలో చోరీకి యత్నించిన ఘటన మరువక ముందే ఆంజనేయస్వామి ఆలయంలో చోరీకి పాల్పడడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

రూ.6,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 1: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,600 పలికింది. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు 92మం ది రైతులు 890క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు 17క్వింటాళ్ల గోనె సం చుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,800,కనిష్ఠ ధర రూ.5,200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

హుజూరాబాద్, ఫిబ్రవరి 1: హుజూరాబాద్ ప్రాంతంలో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ గురువారం తెలిపారు. గత 15రోజులుగా హుజూరాబాద్, జమ్మికుంట ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు సిర్సపల్లి క్రాస్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటర్ సైకిల్‌పై వచ్చిన ముగ్గురు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. జమ్మికుంటకు చెందిన గండికోట గనీ, రాములపల్లికి చెందిన అజయ్‌తో పాటు ఓ బాలుడిని అదుపులో కి తీసుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్‌లోని అరుకు నుంచి గంజాయిని హుజూరాబాద్ పట్టణానికి చెందిన దుండగుల వెంకటేష్, పరుశరాములు తీసుకొచ్చి తమకు ఇచ్చారని తెలిపారు. వెంకటేష్, పరుశరాములు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ముగ్గురి వద్ద నుంచి 560గ్రాముల ఎండు గంజాయిని, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

భారత్‌కు 31 సాయుధ డ్రోన్లు

వాషింగ్టన్, ఫిబ్రవరి1: వాస్తవాధీన రేఖ వెంబడి చైనాకు చెక్ పెట్టేందుకు.. హిందూ మహాసముద్రంలో పట్టు పెంచుకునేందుకు ఇండియాకు ఎంతగానో ఉపయోగపడే ఎమ్‌క్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్లను విక్రయించడానికి అమెరికా ప్రభుత్వం గురువారం ఆమోదం తెలిపింది. ఈ డీల్ కింద 3.99 బిలియన్ డాలర్ల (సుమారు రూ.33వేల కోట్లు) విలువైన 31 డ్రోన్లను అమెరికా సరఫరా చేయనుంది. ఎమ్‌క్యూ-9బి రిమోట్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌గా పిలిచే ఈ సాయుధ డ్రోన్ల కొనుగోలుపై గత జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఇందుకు అవసరమైన అనుమతి మంజూరు చేస్తూ అమెరికా కాంగ్రెస్ సర్టిఫికెట్ ఇచ్చిందని డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ తాజాగా తెలిపింది. అమెరికా-భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాల బలోపేతంలో భాగంగా ఈ మెగా డ్రోన్‌డీల్ జరిగిందని పేర్కొంది. భారత్ భద్రతను పెంచేందుకు, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో సుస్థిర, శాంతి, ఆర్థిక ప్రగతిని పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపింది. మానవరహిత నిఘా విషయంలో భారత్ సామర్థ్యాలు మరింత బలోపేతమవుతాయని అభిప్రాయపడింది. సైన్యం ఆధునికీకరణకు భారత్ కట్టుబడి ఉందని, అందువల్ల వీటిని అందజేయడంలో తమకు ఇబ్బందేమీ లేదని పేర్కొంది. వీటిని హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (హెచ్ఏఎల్ఈ-హేల్)యూఏవీలుగా వ్యవహరిస్తారు. ఈ 31లో 15 డ్రోన్లను సీగార్డియన్ల పేరుతో నేవీకి ఇస్తారు. స్కై గార్డియన్ పేరుతో ఎయిర్‌ఫోర్స్‌కు 8డ్రోన్లు, ల్యాండ్ వర్షన్ పేరుతో ఆర్మీకి మిగతా 8కేటాయిస్తారు. ఖలిస్థాన్ ఉగ్రవాది గురుప్రీత్ సింగ్ పన్నున్ హత్యకు భారత్ కుట్రపన్నుతున్నందున డ్రోన్లఅమ్మకాల ఒప్పందాన్ని అమెరికా నిలిపివేస్తుందంటూ వార్తలువచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ఆమోదం లభించింది.

వీసా ఫీజులు భారీగా పెంచిన అమెరికా

వాషింగ్టన్, ఫిబ్రవరి1: అమెరికాకు వచ్చే విదేశీయుల నుంచి వసూలు చేసే నాన్-ఇమిగ్రెంట్ వీసా ఫీజులను బైడెన్ ప్రభుత్వం బుధవారం భారీగా పెంచింది. వీసా ఫీజులను పెంచడం 2016 తర్వాత ఇదే ప్రథమం. ఏప్రిల్1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. భారతీయులకు అత్యంత ఉపయోగకరంగాఉండే హెచ్-1బీ, ఎల్-1, ఈబీ-5 వీసాల రుసుములు గణనీయంగా పెరిగాయి. విదేశాల వృత్తి నిపుణులు అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి హెచ్-1బీ వీసాలు ఇస్తారు. ఇందుకు ఉద్దేశించిన ఫారం 1-129 ఫీజు 460డాలర్ల (రూ.38,150)నుంచి 780డాలర్ల (రూ.64,690)కు పెరిగింది. హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ రుసుము 10 డాలర్ల నుంచి 215 డాలర్ల (రూ.17,830)కు పెంచారు. ఈ నిర్ణయం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుంది. బహుళజాతి కంపెనీ ఉద్యోగుల బదిలీకి ఉద్దేశించిన ఎల్-1 వీసాల రుసుములు 460డాలర్ల నుంచి 1,385 డాలర్ల (రూ.1,14,860)కు పెరిగాయి. అమెరికా పౌరులకు ఉద్యోగాలిచ్చే వారికి ఈబీ-5 వీసాలు మంజూరు చేస్తారు. వీటి రుసుములు 3,675డాలర్ల నుంచి 11,160 డాలర్ల (రూ.9,25,510)కు పెరిగాయి. మరికొన్ని రకాల వీసాల ఫీజులు స్వల్పంగా తగ్గాయి.

కాంగ్రెస్ వలలో పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేయకండి. సీఎంను కలవాలనుకుంటే సమాచారం ఇచ్చి వెళ్లండి' అని సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. "కాంగ్రెస్ ప్రభుత్వం చాలా సవాళ్లను ఎదుర్కొనాల్సి ఉంది. రాష్ట్ర ఆదాయం అంతంత మాత్రంగా ఉంది. కనీసం అంచనా వేయకుండానే ఇబ్బడిముబ్బడి హామీలిచ్చారు. అమలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఉంటుందా? ఉండదా? అనేది వారి చేతుల్లోనే ఉంది. ప్రతిపక్షంగా సమర్థంగా వ్యవహరిద్దాం. ఏడాది లోపే ప్రజలకు అసలు విషయం తెలుస్తుంది. మనం తొందరపడాల్సిన పనిలేదు. సంయమనం పాటిద్దాం. చక్కగా నిలబడితే చాలు.. వచ్చే ప్రభుత్వం మనదే"నని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలించామని.. ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహం, భయడాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించే అంశంపై పార్లమెంటులో నిరసన తెలపాలని ఎంపీలకు సూచించారు. కేంద్ర జల శక్తి శాఖ మంత్రినీ కలవాలని నిర్దేశించారు. లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా పోరాడదామని.. అందరితో చర్చించి, మంచి అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు.

అసాధ్యమని ఆర్బీఐనే చెప్పింది

రూ.36 వేల కోట్ల రైతు రుణమాఫీ అసాధ్యమని, ఏక మొత్తంలో ఇన్ని కోట్లు మాఫీ వీలుకాదని ఆర్బీఐ తెలిపిందని పార్టీ నేతల వద్ద కేసీఆర్ వ్యాఖ్యానించారు. అయినా.. ఏపీలో చెల్లించారు. తెలంగాణలోనూ రుణమాఫీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. "మనం అధికారంలో ఉన్నప్పుడే కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు. కాంగ్రెస్ ఉంటే చేస్తుందా? వాళ్లకూ చేయదు. శుక్రవారం తెలంగాణ భవన్‌కు వస్తా. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటా" అని కేసీఆర్ తెలిపారు. కాగా, బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన తీరుపై అంశాల వారీగా చర్చించారు. కేటీఆర్, పోచారం, హరీశ్‌రావు, తలసాని, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ప్రమాణం

గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డ ప్రసాద్ తన



చాంబర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పోచారం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలోని ప్రతిపక్ష నేత చాంబర్‌లో కేసీఆర్ ప్రత్యేక పూజలు చేసి బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఈ కార్యక్రమాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కాలె యాదయ్య, పద్మారావుగౌడ్ హాజరు కాలేదని సమాచారం.

రేవంత్ నేను పాత మిత్రులం!

త్వరలోనే రేవంత్‌ను కలుస్తా: మల్లారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): "నేను రేవంత్‌రెడ్డి పాత మిత్రులం. టీడీపీలో కలిసి పనిచేశాం. ఇప్పుడు ఆయన రాష్ట్ర సీఎం. ఆయనను కలిస్తే తప్పేంటి" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. రేవంత్‌ను త్వరలోనే కలుస్తానని చెప్పారు. కీసర ఆలయంలో నిర్వహించబోయే పూజా కార్యక్రమాలకు ఆహ్వానిస్తానని తెలిపారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి ఎంపీ స్థానంలో పోటీ చేయాలని బీఆర్ఎస్ అధిష్ఠానం తనను కోరుతోందని చెప్పారు. అయితే, తన కుమారునికి అవకాశం కల్పించాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని చెప్పారు. అయితే, "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఆ పార్టీ వాళ్లకు షాక్.. అధికారం కోల్పోవడం మాకు షాక్" అని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. కాగా, హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందన్న మల్లారెడ్డి.. త్వరలో గోవాలో రియల్ వ్యాపారం చేస్తానని చెప్పారు. ఇప్పటికే గోవాలో ఓ హోటల్ కొన్నట్లు తెలిపారు.

పాత.. కొత్త స్పీకర్ల కలయిక!



బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 1: ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్లుగా పనిచేసిన, చేస్తున్న ముగ్గురు ఒకచోట కలిశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తరపున అసెంబ్లీ స్పీకర్‌గా 2014-19 వరకు మధుసూదనా చారి, 2019-23 వరకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొనసాగారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తరపున 2023 డిసెంబరు నుంచి గడ్డం ప్రసాద్.. స్పీకర్‌గా కొనసాగుతున్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం సందర్భంగా వారు ముగ్గురు కలిశారు. ఈ సందర్భంగా ముగ్గురూ కలిసి ఫొటో దిగారు.

టచ్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. హైకమాండ్ వద్దనడంతో ఆగాం

» ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలా మంది కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పలువురు ఎమ్మెల్యేలు కలవడమే ఇందుకు నిదర్శనం. వారంతా కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయి. అయితే.. హైకమాండ్ ఇప్పుడప్పుడే పార్టీ ఫిరాయింపులు వద్దని చెప్పింది. అందుకే.. ఫిరాయింపులను ప్రోత్సహించడంలేదు" అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. గురువారం ఆయన కామారెడ్డిలో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. కేటీఆర్ అహంకారపూరితంగా మాట్లాడుతున్నారంటూ షబ్బీర్ అలీ మండిపడ్డారు. "రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను ఛీ కొట్టినప్పటికీ కేటీఆర్ అహంకారం తగ్గడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే సర్కారును కూల్చేస్తామని, త్వరలోనే ప్రభుత్వం పడిపోతుందంటూ కేటీఆర్ అహంకారపూరిత మాటలు మాట్లాడుతున్నారు. ప్రభుత్వాన్ని ఎలా కూలుస్తారో చూస్తాం" అని సవాల్ విసిరారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని బీఆర్ఎస్ లూటీ చేసిందని ఆరోపించారు. ఓ అధికారి వద్దే రూ.100 కోట్ల అవినీతి సొమ్ము బయటపడడం బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమని ఆయన విమర్శించారు.

ఎంపీ టికెట్ ఆశావహులతో గాంధీభవన్‌లో సందడి

కాంగ్రెస్ టికెట్ కోసం 41 మంది దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించడానికి వచ్చిన ఆశావహులు, వారి అనుచరులతో గాంధీభవన్‌లో గురువారం సందడి నెలకొంది. పార్టీ తరఫున తమకు టికెట్ కేటాయించాలని కోరుతూ 41 మంది అభ్యర్థులు దరఖాస్తులు ఇచ్చారు. బుధవారం ఏడుగురు దరఖాస్తు చేసుకోగా గురువారం 34 మంది పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ దరఖాస్తులను సమర్పించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి ఖమ్మం పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేశారు. అదే నియోజకవర్గం నుంచి తనకు అవకాశం కల్పించాలని పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు దరఖాస్తు సమర్పించారు. భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డి, నిజామాబాద్ నుంచి ఆకుల లలిత తదితరులు లోక్‌సభ బరిలో నిలిచేందుకు తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తులు అందజేశారు. నియోజకవర్గాల వారిగా.. మహబూబాబాద్ 9, నాగర్‌కర్నూల్ 8, వరంగల్ 6, భువనగిరి 6, ఖమ్మం 2, నిజామాబాద్ 3 చొప్పున దరఖాస్తులు అందినట్టు గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి.

బడ్జెట్‌లో అందమైన అబద్ధాలు చెప్పారు

» సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లో అందమైన భాషతో అందమైన అబద్ధాలు చెప్పారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ విమర్శించారు. బడ్జెట్‌లో ఉద్యోగాల ఊసే లేదని, కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేశారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు ప్రకటించలేదన్నారు. విద్యా రంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా విస్మరించారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేలా బడ్జెట్ ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ విమర్శించారు.

ఇది భ్రమల బడ్జెట్: తమ్మినేని

కేంద్ర బడ్జెట్‌ను కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే, ప్రజలను భ్రమల్లో పెట్టే బడ్జెట్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించిన బడ్జెట్ ఇది అని పేర్కొన్నారు.

జనాభా వృద్ధి రేటు సవాళ్లపై కమిటీ

» ఉన్నతాధికారులతో ఏర్పాటు చేయనున్న కేంద్రం
» సంతానోత్పత్తి రేటు తగ్గుతోందంటూ నివేదికలు
» తగినంతగా రీ ప్లేస్‌మెంట్ లేదనే ఆందోళనలు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో జనాభా వృద్ధి రేటులో ఎదురవుతున్న సవాళ్లపై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. సంతానోత్పత్తి రేటు భర్తీ స్థాయిల (రీప్లేస్‌మెంట్ రేట్) కంటే పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశంలో 2011లో చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ చేపట్టారు. 2021లో మళ్లీ గణన నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ నేపథ్యంలో వాయిదా వేశారు. ఈ క్రమంలో జనాభాపై సాధికార లెక్కలు లేవు. వృద్ధి రేటు 2.1 నుంచి 2కి తగ్గిందంటూ 2020 నాటి శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్), 2.2 నుంచి 2కు పడిపోయిందంటూ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) పేర్కొన్నాయి. దీనికి పరిష్కార మార్గాలను కమిటీ సూచించనుంది. జనాభా వేగవంతమైన వృద్ధి, మార్పుల నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను పరిశీలించనుంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు యాభై ఏళ్లు

» భాగ్యనగరం నుంచి వాల్తేరుకు మొదటి రైలు ఇదే
» 1974 ఫిబ్రవరి 1న ప్రారంభమైన ఎక్స్‌ప్రెస్



సికింద్రాబాద్/హైదరాబాద్ సిటీ, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎక్స్‌ప్రెస్.. ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రైలు ప్రయాణికులకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రైలు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బెర్తు దొరికిందంటే.. బంగారం బిస్కెట్ దొరికినంతగా విశాఖ ప్రాంతవాసులు ఆనందపడతారంటే అతిశయోక్తికాదు. 1974 ఫిబ్రవరి 1న హైదరాబాద్-విశాఖపట్నం మధ్య ప్రారంభమైన మొట్టమొదటి రైలు ఇది. అంటే ఈ రైలు ప్రవేశపెట్టి గురువారానికి సరిగ్గా యాభై ఏళ్లు పూర్తయ్యాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం హైదరాబాద్(నాంపల్లి) స్టేషన్ నుంచి సాయంత్రం 5.05గంటలకు బయల్దేరి సికింద్రాబాద్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి మీదుగా.. విశాఖపట్నానికి చేరుకుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్దండులైన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ఇది ఎంతో ముఖ్యమైన రైలుగా ఉండేది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రావాలన్నా, ఇక్కడ్నుంచి స్వస్థలాలకు వెళ్లాలన్నా ఈ రైలులో వెళ్లడాన్ని సౌకర్యవంతంగా భావిస్తారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారుల తాకిడి కొంత తగ్గినా.. సాధారణ ప్రయాణికుల నుంచి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు మొత్తం 18స్టేషన్లలో ఆగుతుంది. 24 బోగీలతో అతిపొడవైన రైలుగా పేరుగాంచిన ఈ ఎక్స్‌ప్రెస్ 710 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. గురువారం సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు నాంపల్లి స్టేషన్‌లో ఘనంగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం విశేషం. దక్షిణ మధ్య రైల్వే కూడా ఈ ఎక్స్‌ప్రెస్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించింది. ఈ రైలు ఆగే అన్ని స్టేషన్లలో వేడుకలు జరిపారు. 1990లోనే 24 కోచ్‌లతో అతి పెద్ద రైలుగా పేరొందిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో 2000 సంవత్సరం నుంచి ఫస్ట్‌క్లాస్ ఏసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 1993 నుంచే థర్డ్ ఏసీ కోచ్‌లున్న ఈ రైలు.. దక్షిణ మధ్య రైల్వేలోనే మొదటి ఏసీ కోచ్ ఉన్న ఎక్స్‌ప్రెస్‌గా పేరుగాంచింది. ఈ ఎక్స్‌ప్రెస్‌ను నేరుగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ పర్యవేక్షిస్తారంటే దానికి ఉన్న ప్రాముఖ్యత చెప్పనక్కర్లేదు. రైలు నిర్వహణ నుంచి సమయపాలన, పరిశుభ్రత, ఆహార నాణ్యత, ఫిర్యాదులు, ఇతర ఆపరేషన్స్ అన్నీ ప్రతిరోజూ జీఎం టేబుల్ మీద ఉండాల్సిందేనని చెబుతుంటారు.

74 టీఎంసీలు కేటాయించాలి!

గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రాన్ని డిమాండ్ చేసిన తెలంగాణ

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధానంలో తరలించే 148 టీఎంసీల జలాల్లో 74 టీఎంసీలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరింది. నదుల అనుసంధానంలో తెలంగాణకు 45 టీఎంసీలు కేటాయించాలని ప్రతిపాదించారని, అవి సరిపోవని తెలిపింది. పూర్వ నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పలు ప్రాంతాలకు సాగునీటిని అందించాల్సి ఉన్నందున, 74 టీఎంసీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. గోదావరి-కావేరి అనుసంధానంపైతెలంగాణ లేవనెత్తిన అంశాలపై చర్చించడానికి వీలుగా గురువారం జలసౌధలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) హైదరాబాద్ విభాగం చీఫ్ ఇంజనీర్ దేవేందర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ బి.నాగేంద్రరావు, అంతరాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. గోదావరి-కావేరి అనుసంధానంతో వివిధ అంశాలపై రాష్ట్ర అధికారులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కాగా తెలంగాణ అభ్యంతరాలపై మళ్లీ సమావేశం ఉంటుందని ఎన్‌డబ్ల్యూడీఏ స్పష్టం చేసింది. అనుమానాలన్నీ నివృత్తి చేశాకే నదుల అనుసంధానంలో ముందుకెళతామని తెలిపింది.

నేటి నుంచి పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచుల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యత వహించనున్నారు. ఈ మేరకు గ్రామ ప్రత్యేకాధికారుల నియామకం, బాధ్యతల స్వీకరణ, విధి విధానాలను సూచిస్తూ.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓ, తహశీల్దారు, ఎంపీఓ, డీటీ, ఆర్ఐ, ఇంజనీర్లు, ఎంఈవోలు, ఇతర గెజిటెడ్ స్థాయి అధికారులను గ్రామ ప్రత్యేక అధికారులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో పదేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించడంతో గురువారం సర్పంచుల వద్ద ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నీ సీజ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

నేడు ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటన..?

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'గత ప్రభుత్వం పే స్కేల్ ప్రకటిస్తామని హామీ ఇచ్చింది.. అది అమలుకు నోచుకోలేదు.. కొత్త ప్రభుత్వం మా ఆశలు నెరవేరుస్తుందని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు(శుక్రవారం) ఇంద్రవెల్లి సభలో తమ పే స్కేల్ ప్రకటిస్తారని, సంబురాలు జరుపుకొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నామని ఈజీఎస్ ఉద్యోగులు ఒక ప్రకటనలో తెలిపారు.

కోర్టు ఆదేశాలిచ్చిన గంటల్లోనే జ్ఞానవాపీ సెల్లార్‌లో పూజలు

» హైకోర్టులో అప్పీలు చేసిన మసీదు కమిటీ

వారాణసి, ఫిబ్రవరి 1: జ్ఞాన్‌వాపీ మసీదు సెల్లార్‌లోని 'వ్యాస్ కీ టెఖానా'లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజలు చేసుకోవచ్చంటూ జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిన కొద్ది గంటల్లోనే అక్కడ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో పూజలు చేసి లక్ష్మీదేవి, వినాయకులకు హారతి ఇచ్చారు. 31 సంవత్సరాల అనంతరం వ్యాస్‌జీ కా టెఖానాను పూజల కోసం తెరిచారని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టు అధ్యక్షుడు నాగేంద్ర పాండే తెలిపారు. కాగా, తమకు అప్పీలు వంటి న్యాయ ప్రక్రియకు కూడా అవకాశం ఇవ్వకుండా హిందువులు పూజలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం తగదని పేర్కొంటూ మసీదు కమిటీ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే తొలుత హైకోర్టులో పిటిషన్ వేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ చెప్పడంతో దాన్ని అమలు చేసింది. అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ సమర్పించి అత్యవసరంగా విచారణ జరపాలని కోరింది.

హేమంత్ సోరెన్‌కు ఒక రోజు కస్టడీ

» 10 రోజుల పాటు ఇవ్వాలన్న ఈడీ వినతిపై నేడు తీర్పు
» రాంచీలో 8.5 ఎకరాలు ఆక్రమించినట్టు కేసు నమోదు

రాంచీ, ఫిబ్రవరి 1: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గురువారం ఇక్కడి పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు ఒక రోజు జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. పోలీసులు ఆయనను ఇక్కడి బీర్సా ముండా సెంట్రల్ జైలుకు తరలించారు. ఆయనను పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలన్న వినతిపై కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈడీ బుధవారం ఆయనను ఏడు గంటల పాటు విచారించింది. అనంతరం ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగా రాత్రి పది గంటల సమయంలో గవర్నర్ హౌస్ వద్ద అరెస్టు చేసింది. కాగా, రాత్రి సమయంలో గవర్నర్ హౌస్ ఆవరణలోనే అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ గురువారం సోరేన్ లాయర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సమయంలో ఆయన ధరించిన మతమపరమైన లాకెట్, రింగ్‌లను తీసివేయాలని ఈడీ అధికారులు కోరగా అందుకు ఆయన నిరాకరించారు. రాంచీలో సోరేన్ 12 చోట్ల 8.5 ఎకరాల విస్తీర్ణంగల స్థలాలను అక్రమంగా కలిగి ఉన్నారంటూ ఈడీ కేసుపెట్టింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ నగదు చలామణి జరిగినట్టు ఆరోపించింది. తొలుత భూమి రికార్డుల నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారంటూ రెవెన్యూ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ భాను ప్రతాప్ ప్రసాద్‌పై కేసు నమోదయింది. ఆయన వద్ద 11 ట్రంకు పెట్టెల్లో ఒరిజినల్, నకిలీ దస్తావేజులు, 17 ఒరిజినల్ రిజిస్టర్లు లభించాయి. దీనిపై జరిగిన విచారణలో ఇందులో సోరేన్‌కు సంబంధం ఉందంటూ ప్రసాద్ ఫోన్‌లో లభించిన సమాచారం ఆధారంగా ఈడీ కేసు నమోదు చేసింది. వాంగ్మూలం నమోదు చేయడానికని పిలిచి ఎలా అరెస్టు చేస్తారని సోరేన్ తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ రాజీవ్ రంజన్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి జరిగిన కుట్ర అని ఆరోపించారు.



జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను తరలించడానికి బేగంపేట విమానాశ్రయం వద్ద సిద్ధంగా ఉన్న బస్సులు

ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చంపయి సోరెన్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. హేమంత్ సోరెన్ రాజీనామా చేసిన అనంతరం రాష్ట్రానికి కొత్త సీఎం లేకపోవడంతో గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి లేకపోవడంతో రాజకీయ సంక్షోభం ముదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న తమ విజ్ఞప్తిని అంగీకరించాలని కోరారు. కాగా, చంపయి సోరెన్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేయడంతో.. జేఎంఎం-కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలను హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం రెండు చార్టర్డ్ విమానాలను సిద్ధం చేయగా.. సాయంత్రం 6.30 గంటల సమయంలో పొగమంచు ఎక్కువగా ఉండడంతో వాటిని రద్దు చేశారు. 81 మంది సభ్యులున్న ఝార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎం కూటమికి 43 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక మనీలాండరింగ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ మాజీ సీఎం హేమంత్ సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను విచారించేందుకు సీజేఐ ముగ్గురు న్యాయమూర్తులతో ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారు. సోరెన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరపనున్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి'

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 1: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌జీటీయు ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు శివకుమార్ హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీని యూనిట్‌గా ప్రతి ప్రాథమిక పాఠశాలలో నర్సరీ నుండి ఐదవ తరగతి వరకు ఒక ఒక హెడ్మాస్టర్, ప్రతి తరగతికి ఒక గది, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, అన్ని పాఠశాలల్లో ప్రైమరీ ప్రవేశపెట్టాలని, అంగన్వాడీల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, 317 జీవోతో స్థానికత కోల్పోయిన వారిని స్వంత జిల్లాలకు పంపించాలని, ప్రతి పాఠశాలకు డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఆర్థోపెడిక్ వైద్యుల రాష్ట్ర సదస్సు ప్రారంభం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 1: ఆర్థోపెడిక్ డాక్టర్ల 9వ రాష్ట్ర సదస్సు జిల్లా కేంద్రంలో గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు నగరంలోని రెనే ఆసుపత్రితో పాటు చల్మెడ, ప్రతిమ వైద్య కళాశాలలో లైవ్ సర్జరీల ప్రోగ్రామ్‌లను నిర్వహించారు. రెనే ఆసుపత్రిలో ఆర్థోస్కోపీ అండ్ టోటల్ హిప్ రీప్లేస్మెంట్ సర్జరీ అంశంపై డాక్టర్ బంగారి స్వామి ఆధ్వర్యంలో రెండు లైవ్ సర్జరీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు, రజనీ ఫెర్టిలిటీ సెంటర్ ఫౌండర్ డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తుంటి మార్పిడి ఆపరేషన్, ఆర్థోస్కోపి ఆపరేషన్‌లను లైవ్‌లో చూపిస్తూ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ప్రోగ్రాం ద్వారా ప్రొఫెసర్లు వివరించారు. ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ డాక్టర్ జయప్రసాద్, కో డైరెక్టర్ విజయభాస్కర్, ఫాకల్టీ మెంబర్లు డాక్టర్ శ్రీనివాస్ కాశా, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ వేముల చంద్రశేఖర్, డాక్టర్ సాయి తిరుమల రావు, డాక్టర్ సుధీర్‌ద్వారక్‌నాయుడు, డాక్టర్ ఉదయ్‌కృష్ణ, డాక్టర్ సాయిలక్ష్మన్, డాక్టర్ కొక్కిరాల కిరణ్, డాక్టర్ ఎగ్గన శ్రీనివాస్, డాక్టర్ మీరెడ్డి, ప్రవీణ్, ఆర్థోపెడిక్ పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 1: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ టగ్ ఆఫ్ వార్ ఛాంపియన్ షిప్ పోటీలకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమలో అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వి ఆర్యన్, స్మరణిలను పుష్పగుచ్ఛాలు, అర్హతల పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్‌ల వినియోగంపై నిషేధాజ్ఞలు పొడిగింపు

-పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 1 : కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్టుల వినియోగంపై నిషేధాజ్ఞలు ఈ నెల 29వ తేది వరకు అమలుల్లో ఉంటాయని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● కమిషనరేట్ పరిధిలో సంబంధిత ఏసీపీల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదన్నారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 29వ తేదీ వరకు అమల్లో ఉంటాయన్నారు.

●కరీంనగర్ క్రైం: కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 29వ తేదీ వరకు పొడిగించామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

● కమిషనరేట్ పరిధిలో డీజే సౌండ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 29వ తేదీ వరకు పొడిగించామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

హుజూరాబాద్, ఫిబ్రవరి 1: హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 3న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇందిరాదేవి గురువారం తెలిపారు. హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు ఇతర కళాశాలల డిగ్రీ పాసైన విద్యార్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ బయోడేటా, డిగ్రీ ఉత్తీర్ణత సర్టిఫికెట్లతో ఈ నెల 3న ఉదయం 10:30గంటలకు జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు.

రేపు గురుకులంలో ఇంటర్మీడియేట్ ప్రవేశానికి పరీక్ష

తిమ్మాపూర్, ఫిబ్రవరి 1: అల్గునూరులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రం (సీఓఈ)లో ఇంటర్మీడియేట్ ప్రవేశాలకు అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు టీఎస్ ఇఓఈసెట్ ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు.

మహిళలకు అవగాహన సదస్సు

హుజూరాబాద్, ఫిబ్రవరి 1: హుజూరాబాద్ పట్టణంలోని 5వ వార్డులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల గురువారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలు, సఖి-181 సెంటర్ సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో డీహెచ్ ఈడబ్ల్యూ జెండార్ స్పెషలిస్టు శైలజ, ఫైనాన్షియల్ లిటరసీ రోహిణి, రమ, శిరీష, తిరుమల పాల్గొన్నారు.

నివేశన స్థలాల సమస్య పరిష్కరించాలి : జడ్పీటీసీ

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 1: జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామ లబ్ధిదారులకు వెంటనే నివేశన స్థలాల సమస్యను పరిష్కరించాలని జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ అన్నారు. గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో రజనికి వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీరామ్ శ్యామ్ మాట్లాడుతూ 234సర్వే నెంబర్‌లో ప్రస్తుత ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మూడు నెలల క్రితం ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో అర్హులకు నివేశన స్థలాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారన్నారు.

వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుప్పాల రాజారామ్, ఉప సర్పంచ్ రాజయ్య, వార్డు సభ్యులు అరవింద్, సతీష్, మనోహర్, శాంత, లక్ష్మి పాల్గొన్నారు.

మోడల్ ఈవీఎం కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో

హుజూరాబాద్, ఫిబ్రవరి 1: హుజూరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ ఈవీఎం కేంద్రాన్ని ఆర్డీవో రాజు గురువారం పరిశీలించారు. ఓటు హక్కు వినియోగంపై మోడల్ ఈవీఎంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐలు రంజిత్‌రెడ్డి, శేఖర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రేపు మండల అత్యవసర సర్వసభ్య సమావేశం

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 1: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 3న మండల అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి గౌరవ సభ్యులు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

ఇల్లందకుంట మండల ప్రత్యేకాధికారులు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 1: మండలంలోని 18 గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. బోగంపాడు, ఇల్లందకుంట, లక్ష్మాజిపల్లె గ్రామాలకు ఎంపీడీవో తీగల శంకర్, బూజూనూర్, మల్లన్నపల్లె, కనగర్తి గ్రామాలకు మండల వ్యవసాయాధికారి గుర్రం రజిత, చిన్నకోమటిపల్లి, మల్యాల, మర్రివానిపల్లె గ్రామాలకు తహసీల్దార్ రాణి, పాతర్లపల్లి, రాచపల్లి గ్రామాలకు డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, సీతంపేట, సిరిసేడు, గడ్డివానిపల్లె గ్రామాలకు ఎంపీవో వెంకటేశ్వర్లు, శ్రీరాములపల్లికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, టేకుర్తి, వాగొడ్డురామన్నపల్లె గ్రామాలకు ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ దివ్య, వంతడుపులకు ఏఎస్వో అశోక్‌లను నియమించినట్లు తెలిపారు.

ముగిసిన జేఎల్ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 1: జూనియర్ లైన్‌మెన్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్, స్తంభం ఎక్కించుట పరీక్షను గురువారం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించామని ఎస్ఈ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 52 మందికి జేఎల్ఎం అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపించామన్నారు. అందులో 50 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఇద్దరు అభ్యర్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

అభ్యర్థుల ఫలితాలు త్వరలో ఉన్నతాధికారులు ప్రకటిస్తారని తెలిపారు. ఈ పరీక్షలను పర్యవేక్షించటానికి వరంగల్ నుంచి ముఖ్య పరిశీలకులు సీజీఎం హెచ్‌ఆర్డి ప్రభాకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో చైర్మన్ ఎస్ఈ వి గంగాధర్, డీఈల కమిటీ సభ్యులు విజయేందర్ రెడ్డి, ఈశ్వర్ ప్రసాద్, కన్వీనర్ బండారి చంద్రయ్య పిఓ, ఏపీటీఎస్ ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

4న సుందరకాండ పద్యకావ్య పరిచయ సభ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 1: నగరంలోని ఫిలింభవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు పెండ్యాల కిషన్‌శర్మ రచించిన సుందరకాండము పద్యకావ్య పరిచయ సభను నిర్వహిస్తున్నట్లు భవానీ సాహిత్యవేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీవేత్త, హైకోర్టు న్యాయవాది నారుమంచి వేంకటకృష్ణశర్మ పుస్తకావిష్కరణ చేస్తారని, సాహితీవేత్త, అవధాని డాక్టర్ గండ్ర లక్ష్మణరావు కావ్య పరిచయం చేస్తారని పేర్కొన్నారు. అతిథులుగా అవధానులు తిగుళ్ళ శ్రీహరిశర్మ, ముద్దు రాజయ్య పాల్గొం టారని తెలిపారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని కోరారు.

'సర్పంచుల జీవితాలతో ఆడుకున్న బీఆర్ఎస్ సర్కారు'

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి1: కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని సర్పంచుల జీవితాలతో చెలగాటం ఆడుకుందని, సర్పంచులతో వివిధ రకాల పనులు చేయించుకొని బిల్లులు చెల్లించకుండా వారిని ఆర్థిక ఇబ్బందులోకి నెట్టిందని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఆరోపించారు. గురువారం ఆయన నగరంలో ఆయన ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సర్పంచుల సమస్యలు ముఖ్యంగా బిల్లుల చెల్లింపులు చేయకుండానే ప్రత్యేకాధికారులను నియమించి వారి సమస్యను పూర్తిగా గాలికి వదిలేసిందని బోయినపల్లి ప్రవీణ్‌రావు విమర్శించారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, ఎన్నికల వరకు తమను సర్పంచులుగా కొనసాగించాలంటూ సర్పంచులు ప్రభుత్వం ముందు గగ్గోలు పెట్టినా పట్టించుకోకుండా ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగించడం భావ్యం కాదని అన్నారు. వెంటనే ప్రభుత్వం సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పతకాలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 1: ఇటీవల జిల్లా కేంద్రంలో డ్రాగన్ కుంగ్ ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కరీంనగర్ మానేరు విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలను కైవసం చేసుకున్నారు. కటాస్, స్పారింగ్ విభాగాలల్లో ఇక్షిత, ధనుష్, విశ్వంత్, వర్షిత్, శివసాత్విక్‌లు అద్వితీయ ప్రతిభతో బంగారు, రజిత, కాంస్య పతకాలను సాధించారు.

ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను మానేరువిద్యా సంస్థల అధినేత కడారు అనంతరెడ్డి, కడారు సునితరెడ్డి, ప్రిన్సిపాల్ సరితరెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, జహేద, కరాటే ఇన్‌స్ట్రక్టర్ కోడూరి శేఖర్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బీసీ మంత్రిపై ఓర్వలేక తప్పుడు ప్రచారం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 1: బీసీ నాయకుడు పొన్నం ప్రభాకర్ మంత్రి పదవి చేపట్టినందుకు ఓర్వలేక ఆయనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని డీసీసీ కార్యదర్శి రోళ్ళ సతీష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యకర్తలపై చను వుతో సరదాగా వ్యవహరించిన మంత్రిపై దుస్ప్రచారం చేయటం సరైన చర్య కాదన్నారు. నమ్మిన కార్యకర్తలకు అండగా ఉంటున్న మంత్రిపై ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు.

ప్రధాన మార్కెట్‌ను ఎంఐఎంకు కట్టబెట్టే కుట్ర

-బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుగ్గిళ్ళపు రమేశ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 1: జిల్లా కేంద్రంలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌ను ఎంఐఎంకు కట్టబెట్టేందుకు బీఆర్ ఎస్ నాయకులు కుట్ర చేస్తున్నారని మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గుగ్గిళ్ళపు రమేశ్ ఆరోపించారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఐఎం అధినేత అసదొద్దీన్ ఒవైసీతో గతంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మేయర్ కుమ్మక్కయ్యారని ఆరోపించారు. నగర నడిబొడ్డున వందల కోట్ల రూపాయల విలువచేసే మార్కెట్‌ను ఎంఐఎంకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. గతంలో కూడా మార్కెట్ నగర పాలక సంస్థ ఆధీనం నుంచి చేజారి పోకుండా కార్పొరేటర్‌గా బండి సంజయ్ ఆందోళన చేసి కాపాడారని, దీనిపై మార్కెట్‌కు వెళ్ళి రైతులను అడిగితే చెబుతారని అన్నారు. దేశ ప్రజలంతా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారనే భయంతో బీఆర్ఎస్ నాయకులు అసత్యపు ఆరోపణలతో కుట్రలకు పాల్పడు తున్నారని విమర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సంజయ్ చేతిలో ఓటమి పాలైన వినోద్‌కుమార్ మరోసారి ఓడిపోవడం ఖాయమని తేలడంతో బెంబేలెత్తిపోయి సంజయ్‌పై అనుచిత ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మైనార్టీ ఓట్లను దండుకునే ఉద్దేశంతో ఒక వర్గానికి సంబంధించిన బడా వ్యాపారులకు మార్కెట్‌ను కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు.

పదేళ్ళు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు మార్కెట్‌ను ఏనాడూ పట్టించుకోలేదని, స్మార్ట్‌సిటీ నిధులను 13కోట్లు కేటాయిస్తే నిలిపివేశారని రమేశ్ ఆరోపిం చారు. దమ్ముంటే చర్చకు సిద్ధం కావాలని, ఎంపీ బండి సంజయ్‌ని చర్చకు ఆహ్వానిస్తామని అన్నారు. మాజీ మేయర్ రవీందర్‌సింగ్‌కు కనీస అవగాహన లేకుండా మాట్లాడు తున్నారని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, కార్పొరేటర్ అనూప్, నాయకులు బండ రమణారెడ్డి, దుబ్బాల శ్రీనివాస్, శ్యామ్, సత్యం, హరి పాల్గొన్నారు.

పీవీజేడబ్ల్యూఏ కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా ఎండీ షుకూర్, వి.నరేశ్



కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి1: ఫొటో అండ్ వీడియో జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్(పీవీజేడబ్ల్యూఏ) జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ షుకూర్ (ఆంధ్రజ్యోతి), కార్యదర్శిగా వి.నరేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న ఫొటో, వీడియో జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. అనంతరం జిల్లా శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఏలేటి శైలేందర్ (సాక్షి). దాడి సంపత్‌కుమార్ (ఏబీఎన్), రఘు (సాక్షి), ప్రధాన కార్యదర్శిగా వడ్లూరి నరేశ్ (మైత్రి), కోశాధికారిగా జన్నారం శ్రీనివాస్ (టి న్యూస్), సంయుక్త కార్యదర్శిగా ఎండి సలీం (టివి 9), ప్రచార కార్యదర్శిగా సాయిని సతీశ్ (సాక్షి) ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఎండి అజీం (టివి5), కె కవికుమార్ (వి6), డి సంపత్‌కుమార్ (ఎన్‌టివి), ఎండి నయీం (శ్వేత టివి), బి సదానందం (ఎన్‌టివి టౌన్), జి సుధాకర్ (హెచ్‌ఎం టివి), జొ కిరణ్ (వి 6 వెలుగు), సంతోష్ (ఇండియన్ ఎక్స్‌ప్రెస్), మోసిన్ (ఆంధ్రప్రభ), ఎస్ నర్సింగ్ (శ్వేత టివి), జి అనిల్ (మైత్రి), ఎం రాజశేఖర్ (మైత్రి)లను ఎన్నుకున్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 1 : కరీంనగర్‌లోని ఆటోనగర్ ప్రాంతంలో ఒక స్థావరంపై దాడి చేసిన పోలీసులు నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. పట్టుబడిన వారి వద్ద నుంచి 12 వేల రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో స్పెషల్‌బ్రాంచి, ఒకటో ఠాణా పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా సర్పంచ్‌ల ఆత్మీయ వీడ్కోలు



గాగిరెడ్డిపల్లిలో పంచాయతీ పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్థులు



మానకొండూర్‌లో పాలకవర్గాన్ని సన్మానిస్తున్న జీవీఆర్

శంకరపట్నం, ఫిబ్రవరి 1: శంకరపట్నం మండల సర్పంచ్‌ల ఆత్మీయ వీడ్కోలు సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ ఉమ్మెంత్తల సరోజన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సేవలను కొనియాడారు. జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో బషీరుద్దీన్, ఎంపీటీసీలు, ఏఈలు మొగిలయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● మానకొండూర్: గ్రామాభివృద్ధిలో పంచాయతీ పాలకవర్గం పనితీరు భేష్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు అన్నారు. మానకొండూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులను గురువారం జిల్లా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచు రొడ్డ పృథ్వీరాజ్‌తో పాటు 14 మంది వార్డు సభ్యులకు పూలమాల శాలువాతో సన్మానించారు. జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, ఉపసర్పంచ్ నెల్లి మురళి, వార్డు సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మధుమిత ఆధ్వర్యంలో పంచాయితీ పాలకవర్గాన్ని పూలమాల శాలువాతో సన్మానించారు. గ్రామ సర్పంచు కొట్టె నీలమ్మ, ఎంపీటీసీ ఎరవేని రామాంజనేయులు, కారోబార్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లం శ్రీనివాస్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

● సైదాపూర్: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లతో పాటు పాలకవర్గాలను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కొండ గణేష్ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది పదవికి కానీ ప్రజాసేవకు కాదన్నారు. ఈ ఐదేళ్లలో తమకు సహకరించిన గ్రామాల ప్రజలకు, అధికారులు, నాయకులకు సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కొండ గణేష్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు ధన్యవాదాలు తెలిపారు.

● చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులను, గ్రామ సర్పంచ్ సన్నీల్ల వేంకటేశంను గురువారం గ్రామ అంబేద్కర్ సంఘం, అన్ని వర్గాల ప్రజల ఆధ్వర్యంలో ఘణంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొత్తవినీత-శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా సర్పంచ్‌ల సేవలు అభినందనీయమన్నారు. సర్పంచ్ వేంకటేశం, పాఠశాల కమిటీ చైర్మన్ మంద శ్రీనివాస్, ఉప సర్పంచ్ అన్నాడి మల్లిఖార్జున్‌రెడ్డి, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

వెదిరలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామడుగు, ఫిబ్రవరి 1: మండలంలోని వెదిర శివారులో ఫుట్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. కొద్ది రోజులుగా మతిస్థిమితం లేని వ్యక్తి గ్రామంలో సంచరిస్తున్నాడు. గురువారం సుమారు 40నుంచి 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెంది కనిపించడంతో గ్రామస్థులు కార్యదర్శి రమేష్‌కు సమాచారం అందించారు. ఆయన పోలీసులకు సమాచారం అందించారు.మృతుడి వివరాలు తెలిసిన వారు రామడుగు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

రామడుగు, ఫిబ్రవరి 1: మండలంలోని వివిధ గ్రామాల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గోపాలరావుపేట నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, రామడుగులో పంచాయతీ భవన సముదాయం, వెలిశాలలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. గోపాల్‌రావుపేటలో చదువు మానేసిన విద్యార్థిని అల్ఫోర్స్ పాఠశాలలో చేర్పించారు. సర్పంచ్ కర్ర సత్యప్రసన్న ఉన్నారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 1: జనవరి 24న ప్రారంభమైన జేఈఈ (జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్) మెయిన్స్ మొదటి విడత పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్‌టిఏ సిటి కో-ఆర్డినేటర్ లలితకుమారి తెలిపారు.

సైదాపూర్ మండల పంచాయతీ ప్రత్యేకాధికారులు వీరే

సైదాపూర్, ఫిబ్రవరి 1: మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో అధికారిని ఒకటి నుంచి రెండు గ్రామాలకు ప్రత్యేకాధికారిగా నియమించారు. ఆకునూర్, అమ్మనగుర్తి గ్రామాలకు ప్రత్యేకాధికారిగా డిప్యూటి తహసీల్దార్ మల్లేశం, ఆరెపల్లి, దుద్దెనపల్లి, ఘనపూర్ గ్రామాలకు ఎంపీవో ఆర్ సురేందర్‌కుమార్, బొమ్మకల్, జాగీర్‌పల్లి గ్రామాలకు తహసీల్దార్ డి మంజుల, ఎక్లాస్‌పూర్ గ్రామానికి ఏఈ (పీఆర్) పి.యాదగిరి, గొడిశాల గ్రామానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ జ్యోతి, గుజ్జులపల్లి గ్రామానికి ఎంపీఎస్‌వో పి మహేందర్, గుండ్లపల్లి, లస్మన్నపల్లి గ్రామాలకు ఏఈ (ఆర్‌డబ్ల్యూఎస్) గిరీష్‌బాబు, నల్లరామయ్యపల్లి గ్రామానికి ఏవో ఆర్ వైదేహి, పెర్కపల్లి గ్రామానికి ఏఎస్‌డబ్ల్యూవో టి తిరుపతి, రాయికల్, సైదాపూర్ గ్రామాలకు ఎంపీడీవో ఆర్ పద్మావతి, రాంచంద్రాపూర్ గ్రామానికి ఐసీడీఎస్ సూపర్వైజర్ టి స్వరూప, రాములపల్లి, వెన్నంపల్లి గ్రామాలకు పశువైద్యాధికారి కె విజేందర్, సర్వాయిపేట గ్రామానికి ఎంపీఎస్‌వో ఎస్ మహేందర్, సోమారం గ్రామానికి సూపరింటెండెంట్ (ఎంపీపీ) కె ప్రేమ్‌సాగర్, వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి ఏఈ (మిషన్ భగీరథ) వై శ్రీనివాస్, వెన్కేపల్లి గ్రామానికి పశువైద్యాధికారి సీహెచ్ విజేందర్‌రావ్, ఎల్లంపల్లి గ్రామానికి ఏఈ(ఇరిగేషన్) ఆంజనేయులు ను నియమించారు. 3 నుంచి సర్పంచులకు బదులు వీరు విధులు నిర్వహిస్తారు.

ప్రజా శ్రేయస్సు కోసమే తపాలా శాఖ : ఏసీపీ

హుజూరాబాద్, ఫిబ్రవరి 1: ప్రజా శ్రేయస్సు కోసమే తపాలా శాఖ పనిచేస్తుందని పెద్దపల్లి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ పి. ప్రభాకర్, ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని తపాలా కార్యాలయంలో జాతీయ తపాలా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపాలా శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక వైపు ప్రజలకు సేవ చేయడంతో పాటు డిపాజిట్లు పెట్టుకొని అధిక వడ్డీ ఇస్తున్నామన్నారు. తపాలా శాఖలో పొదుపు చేసి మృతి చెందితే వారికి బీమా కూడా అందజేస్తున్నామన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన కుటుంబాలకు బీమా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ సునీల్, ఏ మోహన్, యూ మహేందర్, అమర్, వేణు, సందీప్, అనిల్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 1: కరీంనగర్ రెండో ఠాణా పరిధిలో ఉన్న పలువురు రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లను గురువారం ఠాణాకు పిలిపించిన సీఐ వెంకటేష్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇక నుంచి సత్ప్రవర్తనతో మెదలాలని, ఎలాంటి నేర ఘటనల్లో తలదూర్చకూడదని హెచ్చరించారు. ఎవరైనా నేర ఘటనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు తీసుకుని పీడీ యాక్టు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 1: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసు తనిఖీలలో పట్టుబడిన ఐదుగురు వాహనదారులకు జైలుశిక్ష, జరిమానా పడిందని ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. ఇటీవల తనిఖీలలో పట్టుబడిన 28 మంది వాహనదారులను గురువారం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఇందులో ఒకరికి 10 రోజులు, మరొకరికి 5 రోజులు, ఇంకో ముగ్గురు వాహనదారులకు 3 రోజులు వంతున జైలు శిక్ష, మొత్తం 9,500 రూపాయల జరిమానా పడిందని తెలిపారు. మిగతా 23 మందికి 39 వేల రూపాయలు జరిమానా పడినట్లు తెలిపారు.

కిసాన్‌నగర్‌లో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 1: కరీంనగర్ కిసాన్‌నగర్‌లో గురువారం రాత్రి ఒక ఇంటిలో అగ్నిప్రమాదం జరిగింది. తుంగ రంజిత్‌కు చెందిన ఇంటిలో 9 గంటల ప్రాంతంలో మంటలు అంటుకోగా స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైరింజనత్‌సహా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. బట్టలు, వంటగదిలోని సామాగ్రి కాలి బూడిదైంది. అగ్నిప్రమాదానికి కాణాలు తెలియరాలేదు. లక్ష రూపాయల వరకు ఆస్థికి నష్టం వాటిల్లిందని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం..?

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 1: కరీంనగర్ ముకరంపుర ప్రాంతంలో గురువారం ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడని తెలిసింది. ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. కాగా దీనిపై ఒకటో ఠాణా సీఐని అడగగా అలాంటి సమాచారం ఏమీ లేదని తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి1: కరీంనగర్ విద్యానగర్ ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో స్పెషల్ బ్రాంచి, రెండో ఠాణా పోలీసులు గురువారం దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వ్యభిచార గృహం నిర్వాహకురాలితో పాటు విటులు గోదావరిఖనికి చెందిన కన్నం ప్రకాశ్, కొప్పుల శ్రావణ్, శ్రీనివాస్‌లను అరెస్టు చేశామని రెండో ఠాణా సీఐ వెంకటేష్ తెలిపారు.

ఎల్ఎల్ఎం పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి1: ఎస్‌యూ పరిధిలోని ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ విద్యార్థులకు అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లిచడానికి 9వ తేదీ వరకు 300రూపాయల అపరాధ రుసుంతో 13 వ తేదీ వరకు గడువు ఉందని ఎస్‌యూ పరీక్షల నియంత్రణా ధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీ రంగ ప్రసాద్ తెలిపారు.

బీఎడ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 1: ఎస్‌యూ పరిధిలోని బీఎడ్ మూడో సెమిస్టర్ విద్యార్థులకు అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి 12 వ తేదీ వరకు 300రూ: ల అపరాధ రుసుంతో 15వ తేదీ వరకు గడువు ఉందని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగ ప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలు ఫిబ్రవరి లేదా మార్చి నెలలో నిర్వహించనున్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 1: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభను టీపీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్ రావు గురువారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే భర్త గాలన్న ఇటీవల అనారోగ్యంతో మరణించగా రోహిత్‌రావుతో పాటు డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎర్ర శ్రీనివాస్, పలువురు నాయకులు కరీంనగర్‌లో ఆమె నివాసానికి వెళ్ళి పరామర్శించారు.

విద్యార్థులకు అభినందన

హుజూరాబాద్, ఫిబ్రవరి 1: అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన హుజూరాబాద్ విద్యార్థులు షాదుల్లాబాబా, మహ్మద్ లతీఫ్‌బాబాలను జనార్ధన్, మహ్మద్ ఖాలీద్‌హుస్సేన్, ఉప్పు శ్రీనివాస్, రాజ్ కుమార్, జమదగ్ని, మహ్మద్ అలీం, లక్ష్మణమూర్తి, సమ్మయ్య, సందీప్‌లను కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

శంకరపట్నం, ఫిబ్రవరి 1: శంకరపట్నం మండలంలోని కాచాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతిగౌడ్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాతంగి ఓదయ్య కుటుంబానికి రూ. 5వేల ఆర్థిక సహాయంతో పాటు 25కేజీల బియ్యం అందజేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మానకొండూర్, జనవరి 1: మండలంలోని వెల్ది గ్రామంలో బుధవారం రూ.60లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను గ్రామ సర్పంచు రుద్రవరం లక్ష్మీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆర్. పద్మ, ఉపసర్పంచు ఎన్. రవీందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగికి సన్మానం

హుజూరాబాద్, ఫిబ్రవరి 1: హుజూరాబాద్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో పదేళ్లుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఉద్యోగి రవీందర్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పార్థసారథి, బ్యాంకు ఉద్యోగులు పాషా, దాసరి రాజు, రంజిత్, రమేష్, గౌతమ్, గంగారామ్, సతీష్, వీరస్వామి తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

గంగాధర, ఫిబ్రవరి 1: గంగాధర మండలం బూరుగుపల్లిలో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం ప్రారంభించారు. సర్పంచ్ సాగి రమ్యమహిపాల్‌రావు, ఎంపీటీసీ దూలం లక్ష్మి శంకర్‌గౌడ్, బీజేపీ నాయకుడు దూళం కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజమౌళి

చొప్పదండి, ఫిబ్రవరి 1: చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న కొయ్యల రాజమౌళిని కరీంనగర్ జిల్లా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చ రర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు.

రైతు సంఘం కార్యవర్గం ఎన్నిక

చొప్పదండి, ఫిబ్రవరి 1: చొప్పదండిలోని విజయనగరం రెడ్డి రైతు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గుర్రం చంద్రారెడ్డి, ఉపాధ్యక్షునిగా ఉసికె రాజశేఖర్‌రెడ్డి, సభ్యులుగా గుర్రం శంభులింగారెడ్డి, గుర్రం తిరుపతి రెడ్డి, గుర్రం జగన్నాథ్‌రెడ్డి, యాళ్ళ మధుసూదన్‌రెడ్డి, కళ్ళెం తిరుపతి రెడ్డి, మరిమడ్ల నారాయణ, గడ్డం రాజేశ్వర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.